AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
10-6-2026 (Wednesday) MAIN EDITION

## బలహీన పడనున్న రుతుపవనాలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు బలహీనపడనున్నాయి. దీంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలోని ఈ నెల 8న రుతుపవనాలు ప్రవేశించిన విషయం తెలిసిందే. దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాలో విస్తరించిన రుతుపవనాలు అనంతరం బలహీనంగా మారాయి. రుతుపవనాల రాకతో రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. అయితే ఈరోజు దక్షిణ తెలంగాణ హైదరాబాద్ పరిధిలో నైరుతి రుతుపవనాలు నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనలో తొమ్మిదికి చేరిన మృతులు



**అక్షరటుడే, విశాఖపట్నం:** విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. ప్లాంట్ సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఉక్కుద్రవం తరలిస్తున్న లాడర్ పేలడంతో 8 మంది కార్మికులు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పైడిరాజు అనే కార్మికుడు బుధవారం కన్నుమూశాడు. మూడురోజుల పాటు మృత్యువుతో పోరాడి మరణించాడు.

## టీఎంసీ నేతపై కోడిగుడ్లతో దాడి




అక్షరటుడే, కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో మరో టీఎంసీ నేతపై కోడిగుడ్లతో దాడి జరిగింది. ప్రజాధనాన్ని దోచుకున్నారంటూ కృష్ణనగర్‌లోని మాజీ మంత్రి ఉజ్జల్ బిస్వాస్ నివాసానికి స్థానికులు, నిరసన కారులు వెళ్లారు. ఇంట్లోకి వెళ్లి ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ముఖంపై కోడిగుడ్లతో దాడి చేశారు.

## అమరావతికి కేంద్రం భారీ నజరానా



అక్షరటుడే, అమరావతి: రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రాజెక్టును ప్రకటించింది. రూ.2,534 కోట్ల భారీ వ్యయంతో అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ (కేంద్ర సచివాలయం) నిర్మాణం చేపట్టనుంది. ఈ మేరకు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ పంపిన ప్రతిపాదనలకు కేంద్ర క్యాబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది.

## ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు



అక్షరటుడే, బిజినెస్‌డెస్క్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. దీంతో గ్లోబల్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. దీని ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్ పైనా కనిపించింది. బుధవారం ఉదయం లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు మధ్యాహ్నం వరకు ఒడిదుడుకులతో సాగాయి.చివరికి సెన్సెక్స్ 64 పాయింట్ల లాభంతో, నిఫ్టీ 27 పాయింట్ల నష్టంతో స్థిరపడ్డాయి.

## కెనడాలో విషాదం.. భారత సంతతి పోలీసు మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కెనడాలో అంటారియో ప్రావిన్షియల్ పోలీస్ (ఓపీపీ) అధికారిగా పనిచేస్తున్న పంజాబ్‌కి చెందిన తరుణ్ బాలి (28) విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అటు కెనడాలోని భారతీయ సమాజంలోనూ, ఇటు పంజాబ్‌లోని నంగల్ పట్టణంలోనూ తీవ్ర విషాదాన్ని నింపింది. మంగళవారం మధ్యాహ్నం అంటారియోలోని హర్స్ట్ ప్రాంతంలో తరుణ్ బాలి తన బృందంతో కలిసి విధుల్లో ఉండగా ఈ దురదృష్టకర ఘటన జరిగింది. దర్యాప్తులో భాగంగా అక్కడికి వెళ్లిన పోలీసు అధికారులపైకి, ఒక నిందితుడు ఉద్దేశపూర్వకంగా వాహనాన్ని దూసుకెళ్లడంతో కానిస్టేబుల్ తరుణ్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన వైద్య సిబ్బంది ఆయనను కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ, తరుణ్ మరణించారు. ఈ ఘటనలో మరో అధికారి కూడా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు.



## భార్యను గన్‌తో కాల్చి చంపిన భర్త

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** మల్కాజ్‌గిరిలో కాల్పుల కలకలం రేపాయి. భార్యను తుపాకీతో కాల్చి చంపాడో వ్యక్తి. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. మల్కాజ్‌గిరి పరిధిలోని మారుతినగర్‌కు చెందిన అరుణ్ కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతడికి గతంలో మొదటి భార్యతో ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఆమె ఆరోగ్యం బాగాలేకపోవడంతో మొదటి భార్య సోదరి నిషారాణిని రెండో వివాహం చేసుకున్నాడు. అయితే ఆమెకు ఇతర వ్యక్తులతో సంబంధం ఉందని అరుణ్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో దంపతుల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం కూర్చొని మాట్లాడుకుందామని నిషారాణికి అరుణ్ చెప్పాడు. మరో వ్యక్తితో కలిసి వచ్చాడు. అనంతరం ఆమెపై కాల్పులు జరిపాడు. దీంతో నిషారాణి అక్కడికక్కడే మృతి చెందింది.

హైదరాబాద్ మహా నగరంలో చిన్న పాటి వర్షం కురి సిన రోడ్లన్నీ జలమయం అవుతు న్నాయి. అరగంట వర్షం పడితే రహదారులు చెరువులను తలపిస్తు న్నాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోతున్నాయి. ఫలితంగా అరగంటలో చేరుకోవాల్సిన గమ్య స్థానాలకు గంటల కొద్ది సమయం పడుతోంది. దీంతో వాహనదారులు రోడ్లపై నరకయాతన అనుభవిస్తున్నారు.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# మహానగరంలో..

# చినుకు పడితే చిక్కులే!

- చిన్న వర్షా నికి జలమయం అవుతున్న రోడ్లు
- ట్రాఫిక్ జామ్‌తో నగరవాసుల తిప్పలు
- ఇళ్లకు చేరడానికి గంటల పాటు నరకయాతన

హైదరాబాద్‌లో జూన్ 9న కురిసిన వర్షం వాహనదారులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చిపెట్టింది. కేవలం గంట సేపు కురిసిన వర్షానికే ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించడంతో, సాధారణంగా 20 నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యస్థానాలకు చేరుకోవడానికి వాహనదారులకు ఏకంగా 6 గంటల సమయం పట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే క్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆఫీసు వేళలు పూర్తయ్యాక ఒకేసారి జనం రోడ్లపైకి రావడం, పలు రహదారులు జలదిగ్బంధనం కావడం, ట్రాఫిక్ జామ్.. ఇలా రకరకాల కారణాలతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

### ఐటీ కారిడార్‌లో అధ్వాన పరిస్థితి..

నగరంలో ఐటీ రంగానికి కీలకమైన హైటెక్ సిటీ, రాయదుర్గం, కోకాపేట ప్రాంతాల్లో పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయి. అనేక హైరైజ్ బిల్డింగ్లు కడుతున్న ఈ ప్రాంతంలో చిన్నపాటి వర్షానికే రోడ్లపై మోకాళ్ళ లోతు నీరు నిలిచిపోవడంపై స్థానికులు, ఐటీ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల వ్యాపారం జరిగే ఈ ప్రాంతాల్లో, కనీస డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం, వరద నీటిని మళ్లించే మార్గాలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### మెట్రోలో రద్దీ..

రోడ్లపై వాహనాలు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడటంతో, చాలామంది ప్రయాణికులు మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. రైళ్లలో చోటు దొరకక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మెట్రో రైళ్లలో కూడా రద్దీ విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

### హైడ్రా ఏం చేస్తుంది

నగరంలో వరదల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం చిన్న వాన పడ్డ అనేక ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. మ్యాన్‌హోల్స్ బ్లాక్ అయి నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపై నిలిచిపోతుంది. ఫ్లై ఓవర్లపై సైతం నీరు నిలుస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వర్షాకాలం ప్రారంభానికి ముందు చర్యలు చేపట్టాల్సిన అధికారులు స్పందించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల సమన్వయంతో వరద నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని భాగ్యనగర వాసులు కోరుతున్నారు.

## స్టీల్ ప్లాంట్ వరుస ప్రమాదాలు.. ప్రభుత్వ తీరుపై జగన్ ఫైర్




**అక్షరటుడే, విశాఖపట్నం:** విశాఖ ఉక్కు కర్మాగారంలో వరుస ప్రమాదాలు చోటుచేసుకోవడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే స్టీల్ ప్లాంట్‌లో పరిస్థితులు అధ్వాన్నంగా మారాయని ఆయన విమర్శించారు. తాజాగా జరిగిన ప్రమాదంపై స్పందించిన జగన్, ఇది కేవలం ఉద్యోగుల తప్పిదం కాదని స్పష్టం చేశారు. ముడి సరుకుల మిక్సింగ్‌లో జరిగిన పొరపాట్ల వల్లే ఉక్కు ద్రవం బ్లాస్ట్ అయ్యిందని, సరైన ప్రమాణాలు పాటించకపోవడమే ఈ దుర్ఘటనలకు కారణమని ఆయన ఆరోపించారు. ఈ ప్రమాదంలో 9 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు.

## 'మీనాక్షి నటరాజన్ కేసు వివరాలు బయటపెట్టిందెవరు'



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఈసీ తిరస్కరించిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ నాయకులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ సంచలన ట్వీట్ చేశారు. అంతటా గట్టిగా అరుస్తున్న కాంగ్రెస్ బృందం, మీడియాలోని వారి అనుకూల వాదులు.. ఆ పార్టీకి చెందిన వారిలో ఎవరు తెలంగాణ అంశాన్ని బహిరంగ చర్చలోకి తెచ్చారన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందికర పరిస్థితులను నివారించడానికి ఆ లోపాన్ని సరిదిద్దుకోవడం మంచిదని ఆయన కాంగ్రెస్‌కు సూచించారు.

## ప్రధానిగా నెహ్రూ రికార్డు బ్రేక్ చేసిన నరేంద్రమోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరో రికార్డు బద్దలు కొట్టారు. దేశంలో అత్యధిక కాలం పాటు పనిచేసిన తొలి ఎన్నికైన ప్రధానిగా చరిత్ర సృష్టించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ప్రధానిగా మోదీ మరో మైలురాయిని చేరుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై ప్రధానమంత్రిగా సుదీర్ఘకాలం నిర్విరామ సేవలందించిన దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును మోదీ తిరగరాశారు. వరుసగా మూడు సాధారణ ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీ.. అత్యధిక కాలం ప్రధానమంత్రి పదవిలో కొనసాగిన నేతగా కొత్త రికార్డు సృష్టించారు. ఈ రికార్డు ఇప్పటి వరకు నెహ్రూ పేరిట ఉంది. ఆయన 4,398 రోజులపాటు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రధానిగా ఉన్నారు. ఆ రికార్డును మోదీ అధిగమించారు.

### ఎదురులేని మోదీ..

నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబరు 7న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత వరుసగా విజయాలు సాధిస్తూ 2014 మే 21 వరకు.. అంటే 4,610 రోజులు ఏకధాటిగా ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. 2014 మే 26న ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి ఆయనే ఆ పదవిలో కొనసాగుతున్నారు. మూడు విడతలలో కలిపి ఇప్పటివరకు 4,399 రోజుల పదవీ కాలం పూర్తయ్యింది. మరో విశేషం ఏమిటంటే ఈ ఏడాది మార్చి 22 నాటికి నరేంద్ర మోదీ సీఎంగా, పీఎంగా కలిపి మొత్తం 8,931 రోజులు పూర్తి చేసుకున్నారు.

## మోదీ రికార్డులే దేశానికి సమస్యలు: జైరాం రమేశ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. మోదీ సాధించిన రికార్డులు దేశానికి మేలు చేయకపోగా, సమస్యలుగా మారాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఆయన పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రమాదంలో పడ్డాయని ఆయన మండిపడ్డారు. పేపర్ లీకేజీ కుంభకోణాలతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని, ఎన్నికల సంఘం వంటి స్వతంత్ర సంస్థలు నిర్వీర్యమవుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను బలహీన పరుస్తున్నారని జైరాం రమేశ్ తీవ్రంగా విమర్శించారు.

## మోహన్ నాయక్‌కు 14 రోజుల రిమాండ్



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) మోహన్‌నాయక్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఆయనకు చెందిన 16 చోట్ల అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించగా, భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. సోదాల్లో సుమారు రూ. 17.94 కోట్ల విలువైన అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. అయితే, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ సుమారు రూ. 150 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అరెస్ట్ చేసిన అనంతరం మోహన్ నాయక్‌ను ఏసీబీ అధికారులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు న్యాయస్థానం ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాలతో అధికారులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు.



## రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ కరువైంది: కవిత

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని తెలంగాణ రక్షణ సేన అధినేత, మాజీ ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలకు భద్రత కరువైందని, నిత్యం దాడులు, అత్యాచార ఘటనలు చోటుచేసుకోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆమె విమర్శించారు. ఖమ్మం నగరంలో 12 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడి, ఆపై నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసేసిన ఘటన అత్యంత దారుణమని, ఇది అందరినీ కలిచివేసిందన్నారు. జిల్లా కేంద్రానికే ఇలాంటి పరిస్థితి ఉంటే, ఇక మారుమూల ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు జరిపి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### మల్కాజిగిరి ఘటన..

హైదరాబాద్ మల్కాజిగిరిలో భార్యను తుపాకీతో కాల్చి చంపిన ఘటనపై ఆమె స్పందించారు. మూడు నెలల క్రితమే సదరు వ్యక్తి బహిరంగంగా తుపాకీ ప్రదర్శిస్తూ బెదిరింపులకు పాల్పడినప్పుడే పోలీసులు చర్యలు తీసుకుంటే, ఈరోజు ప్రాణనష్టం జరిగి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. పోలీసుల నిర్లక్ష్యంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.